నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY

**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939

సంపుటి :12 సంచిక :322 రంగారెడ్డి | మంగళవారం 17 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00
Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada



# దిక్సూచి.. తెలంగాణ
## ప్రపంచానికి మార్గదర్శనం

- శ్రమించే తత్వంగల శాంతికాములు తెలంగాణ ప్రజలు
- ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- 2047 రైజింగ్ తెలంగాణ దిశగా అడుగులు
- తెలుగులో ప్రసంగం మొదలెట్టిన గవర్నర్ శుక్లా

- బడ్జెట్ భేటీ షురూ
- అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం
- 20న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన గవర్నర్ శుక్లా
- అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- పాల్గొన్న సీఎం, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు

తెలంగాణ శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11.45 గంటలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం సభ మరుసటి రోజుకి వాయిదా పడింది. అనంతరం అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల నిర్వహణపై వేర్వేరుగా బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (BAC) భేటీ నిర్వహించారు. ఈ భేటీలో శాసనసభ, మండలి సమావేశాలను ఎన్ని రోజులపాటు నిర్వహించాలి? ఏయే అంశాలను సభలో చర్చించాలి? అనే అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. కాగా, సభలో ఈ నెల 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. 19న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉభయసభలకు సెలవు ఉంటుంది. ఈ నెల 20న అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. 21న రంజాన్, 22న ఆదివారం సందర్భంగా ఉభయ సభలకు విరామం ఉంటుంది. 23 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాల్లో వివిధ శాఖల పద్దులపై చర్చిస్తారు.

### తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ..

జీహెచ్ఎంసీ చట్టసవరణ, వైద్యవిధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్పు చేస్తూ చట్ట సవరణ, గిగ్ వర్కర్స్ సంక్షేమం.. తదితర బిల్లులను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మూసీ పునరుజ్జీవంపై అసెంబ్లీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయి. అసెంబ్లీ ఆవరణలో సోమవారం ఉదయం 11.27 గంటలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



### శ్రమించే తత్వంగల శాంతికాముకులు..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగించారు. తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన గవర్నర్.. శ్రమించే తత్వం గల శాంతికాముక తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.




సమావేశాల్లో ఆరు గ్యారెంటీలు, గోదావరి నదీ జలాల వివాదం, మూసీ సుందరీకరణ, గాంధీ సరోవర్ ప్రాజెక్టు తదితర అంశాలపై చర్చకు పట్టుబట్టేందుకు ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. అయితే, సాధ్యమైనంత తొందరగా అసెంబ్లీ సమావేశాలను ముగించాలన్న ఆలోచనతో అధికార పక్షం కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తున్నది. గరిష్ఠంగా 10 పని దినాల్లోనే సభను ముగించాలని అధికార పక్షం నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులోనే గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానం, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించడం తదితర అంశాలను పూర్తిచేయాల్సి ఉంటుంది.

### కీలక బిల్లులు సభ ముందుకు..

ఈ నెల 20న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి, 29 లేదా 30వ తేదీల్లో ద్రవ్య వినిమయ బిల్లు పాస్ చేయించి, సభను వాయిదా వేసే విధంగా వ్యూహరచన చేసినట్టు తెలుస్తోంది. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా జాప్యం, సింగరేణి బొగ్గు గనుల అవినీతి, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తుది తీర్పు, మూసీ కూల్చివేతలు తదితర అంశాలపై సభలో బీఆర్ఎస్ నిలదీసే అవకాశం ఉన్నదని, 'సేవ్ తెలంగాణ' నినాదంతో బీఆర్ఎస్ సభ్యులు సభలోకి వచ్చే అవకాశం ఉన్నదని ప్రభుత్వానికి ఉప్పందటంతో ముఖ్యమంత్రి, మంత్రివర్గం అప్రమత్తమైనట్టు సమాచారం. మార్చి 30 వరకు సభను ముగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

హైదరాబాద్, మార్చి 16 నిర్భయవార్త ప్రతినిది :

# అసెంబ్లీ హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్, మార్చి 16 నిర్భయవార్త ప్రతినిది : ప్రజా ప్రభుత్వంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన ప్రసంగంలో వివరించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని అన్నారు. సోమవారం సీఎల్పీ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై ప్రభుత్వ విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృథా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ హయాంలో.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని ఆగ్రహించారు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నన్ను సభకు రాకుండా చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హుకుం జారీ చేశారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని మార్గనిర్దేశం చేశారు. సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసమని తెలిపారు. అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలు పర్యటించి సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని దిశానిర్దేశం చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని.. ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తుందని అన్నారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని తెలిపారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు. ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుందని అన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.


# ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

హైదరాబాద్, మార్చి 16 నిర్భయవార్త ప్రతినిది : 2025 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను సోమవారం ప్రకటించారు. మొత్తం 24 భారతీయ భాషల్లోని ఉత్తమ రచనలకుగాను ఈ అవార్డులను ఖరారు చేసినట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ లెటర్స్ వెల్లడించింది. వాస్తవానికి 2025 డిసెంబర్ లోనే వీటిని ప్రకటించాల్సి ఉంది. కానీ అనివార్య కారణాల వల్ల అది కుదరలేదు. అందువల్ల నేడు అధికారికంగా ఆ పురస్కారాలను ప్రకటించారు. "ఈ ఏడాది అవార్డు గెలుచుకున్న వాటిలో 8 కవితా సంకలనాలు, 4 నవలలు, 6 కథానికలు, 2 వ్యాస సంపుటాలు, 1 సాహిత్య విమర్శ గ్రంథం, 1 ఆత్మకథ, 2 జ్ఞాపకాలు (మెమోయిర్స్) ఉన్నాయి" కేంద్ర సాహిత్య అకాడమీ పేర్కొంది. విజేతలకు 2026 మార్చి 31న ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో శాలువా కప్పి, ఈ ప్రతిష్ఠాత్మ పురస్కారాన్ని (తామ్ర పత్రం), ఒక లక్ష నగదును అందించనున్నామని తెలిపింది.







# ఈ నెల 30వరకు అసెంబ్లీ సమావేశాలు
## బీఏసీలో నిర్ణయం...



హైదరాబాద్, మార్చి 16 నిర్భయవార్త ప్రతినిది : ఈనెల 30వతేదీ వరకు తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ సమావేశాలను మార్చి 16 నుండి మార్చి 30వ తేదీ వరకు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. ఇవాళ ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 17, 18న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, ముఖ్యమంత్రి సమాధానం ఉంటుంది. ఈనెల 19న ఉగాది పండుగ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ఇస్తారు. ఈనెల 20వ తేదీన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈనెల 23నుండి వివిధ శాఖల పద్దులపై చర్చలు ప్రారంభమవుతాయి. ఈనెల 30వ తేదీన బడ్జెట్ ఆమోదం పొందనుంది. అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడుతుంది.

# కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం..
## చోద్యం చూస్తున్న కాంగ్రెస్ సర్కార్ : మాజీ మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్ మార్చి 16 నిర్భయవార్త ప్రతినిది : కృష్ణా , గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్న కాంగ్రెస్ సర్కార్ చోద్యం చూస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఆంధ్రాకు దాసోహమై తెలంగాణను చంద్రబాబుకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. గోదావరి, బనకచర్లపై ఢిల్లీ మీటింగ్ మినిట్స్ వచ్చి నెల దాటినా అందులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మొద్దు నిద్ర వీడి నీటి హక్కులను కాపాడాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేఖల డ్రామాలు కట్టిపెట్టాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం పోలవరం – నల్లమలసాగర్ ప్రాజెక్టు కట్టి తీరుతామని ఏపీ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో పేర్కొంటే, దీనికి దీటుగా సమాధానం చెప్పాల్సిన తెలంగాణ ప్రభుత్వం కనీసం పోలవరం – నల్లమలసాగర్‌ను అడ్డుకుంటాం, కృష్ణా – గోదావరిలో చుక్క నీరు కూడా వదులుకోమని తెలంగాణ గవర్నర్ ప్రసంగంలో ఎందుకు చెప్పలేదని నిలదీశారు.

# అన్ని రాష్ట్రాల్లో ఎల్‌పీజీ 100 శాతం సరఫరా చేస్తాం: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 16 నిర్భయవార్త ప్రతినిది: పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాల్లో గ్యాస్ సంక్షోభం నెలకొంది. కానీ ఇప్పటి వరకు భారత్‌లో మాత్రం అలాంటి పరిస్థితులు రాలేదు. సోషల్ మీడియాలో మాత్రం విస్తృతంగా తప్పుడు ప్రచారం సాగుతుంది. దీంతో ప్రజలు గ్యాస్ ఏజెన్సీలకు క్యూ కడుతున్నారు. అవసరం ఉన్నా లేకున్నా ముందు జాగ్రత్తగా గ్యాస్ సిలిండర్లు భద్రం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. వంట గ్యాస్ సరఫరాపై పెట్రోలియం–సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ ... గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్‌పీజీ సరఫరా చేస్తామని, అన్ని రాష్ట్రాల్లో ఎల్‌పీజీ స్టాక్ ఉందని ప్రకటించారు. హర్మూజ్ దగ్గర భారత నౌకలన్నీ క్షేమంగానే ఉన్నాయని, శివాలిక్ నౌక ఈరోజు సాయంత్రం 5 గంటలకు భారత తీరానికి చేరుకుంటుందని తెలిపారు. శివాలిక్ నౌకలో 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉన్నట్లుగా వెల్లడించారు. ప్రస్తుతం ముడి చమురు తగినంత స్థాయిలో అందుబాటులో ఉందన్నారు. అన్ని శుద్ధి కర్మాగారాలు అత్యధిక సామర్థ్యంతో పనిచేస్తున్నాయని చెప్పారు. ఇక పెట్రోల్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని.. చమురు సమృద్ధిగా ఉందని స్పష్టం చేశారు.



నిర్భయవార్త


సంపాదకీయం

మంగళవారం 17, మార్చి 2026

## వంటగ్యాస్ మంటలు

ఇరాన్ యుద్ధం ప్రభావం ఇంట్లోకి వచ్చేసింది. వంటింట్లో మంటలు పుట్టిస్తున్నది. దేశవ్యాప్తంగా హోటళ్లు, దాబాలు, హాస్టళ్లు, క్యాంటీన్లు మొత్తంగా మూతపడుతున్నాయి. లేదా వంటకాలను పరిమితం చేస్తున్నాయి. బడిపిల్లల మధ్యాహ్న భోజనానికి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇంటికి సమయానికి రావాల్సిన సిలిండర్ ఆలస్యం కావడంతో ప్రజలు ఆందోళనతో గ్యాస్ గోదాములకు పరుగులెత్తుతున్నారు. సిలిండర్ల కోసం బారులు తీరిన జనాల దృశ్యాలు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. డీలర్లు కమర్షియల్ వంటగ్యాస్ సిలిండర్ సరఫరాపై చేతులెత్తేస్తున్నారు. ఈ నేపథ్యంలో వంటగ్యాస్ ప్రత్యామ్నాయాలపై ఆలోచనలు జరుగుతున్నాయి. అవకాశం ఉన్నచోట్ల కట్టెలపొయ్యిలకు మారిపోతున్నారు. ఆన్‌లైన్ సేల్స్ నుంచి ఇండక్షన్ కుక్కర్లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు మాయమయ్యాయని వార్తలు వెలువడుతున్నాయి. మరోవైపు రైల్వే క్యాటరింగ్‌లోనూ ప్రత్యామ్నాయాల కోసం వెంపర్లాడుతున్నారు. వాణిజ్య సరఫరాను పునరుద్ధరించకపోతే హైదరాబాద్‌తో సహా తెలంగాణ అంతటా దాదాపు 90 శాతం హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు 48 గంటల్లోపు మూసివేయవలసి వస్తుందని తెలంగాణ రాష్ట్ర హోటల్ అసోసియేషన్ హెచ్చరించింది. వాణిజ్య సంస్థలన్నిటినీ ఒకేగాటన కట్టి సరఫరా జరుపుతుండటం వల్ల హోటళ్ల వంటి నిత్యావసర వ్యవస్థ కుప్పకూలింది. తెలంగాణ వార్తలు సందట్లో సడేమియా బ్లాక్ మార్కెట్ దందా విజృంభిస్తున్నది. మరోవైపు ఆటోలు, ఇతర వాహనాలు కూడా గ్యాస్ ఫిల్లింగ్ కోసం బంకుల ముందు బారులు తీరుతున్నాయి. తక్షణం సమన్వయంతో కూడిన చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కేంద్ర పెట్రోలియం మంత్రికి రాసిన లేఖలో సూచించారు. ఇంత జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం 'దేశవ్యాప్తంగా సంక్షోభం లేదంటూ' సమస్యను తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నించడం విడ్డూరం. తక్షణం 10% గ్యాస్ ఉత్పత్తి పెంచమని రిఫైనరీలకు ఆదేశాలు జారీ చేయడాన్ని చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడమేనని చెప్పక తప్పదు. కేంద్రం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వంటి పథకాలు పెట్టి వంట గ్యాస్ ఉపయోగాన్ని కేంద్రం ప్రోత్సహించింది. ప్రధాని వ్యక్తిగత ప్రచారానికి గ్యాస్ సిలిండర్‌ను వాడుకున్నారు. మరోవైపు గట్టుచప్పుడు కాకుండా సబ్సిడీలకు మంగళం పాడుతూ తాను మోయాల్సిన భారాన్ని ప్రజలకు బదిలీ చేసి ప్రభుత్వం చేతులు దులిపేసుకున్నది. అంతేకాక ధరలు పెంచింది. తాజాగా వాణిజ్య సిలిండర్ ధరను ... పెంచింది. అయినప్పటికీ పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా స్థిరమైన సరఫరాలు, నిల్వలు నిర్వహించడంలో అసమర్థతను చాటుకున్నది. యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నవేళ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేకపోయిందన్నది వాస్తవం. ఫలితంగా దేశం వంటగ్యాస్ కొరతతో సతమతం అవుతున్నది. పైగా ప్రభుత్వం ముక్తసరి ప్రకటనలతో, అప్పుడప్పుడు ట్వీట్‌ల ద్వారా మాత్రమే సమాచారాన్ని చేరవేస్తున్నది. దీనివల్ల ఇంధన లభ్యతపై హామీల కంటే వేగంగా భయాందోళనలు వ్యాపించాయి. అంటే సరఫరాను మెరుగుపర్చేందుకు సకాలంలో తగిన చర్యలు తీసుకోవడం, సర్కారు పెద్దల ద్వారా నేరుగా భరోసా కల్పించడంలో కేంద్రం ఘోరంగా విఫలమైంది. ఈ సమస్య ఇప్పటికిప్పుడు వచ్చిపడింది కాదు. విదేశాంగ విధానంలో తప్పటడుగులు సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధం దాదాపుగా అనివార్యమని తేలిపోయిన తరుణంలో ప్రధాని మోదీ హుటాహుటిన ఇజ్రాయెల్‌కు వెళ్లి ఆ దేశానికి మద్దతు తెలుపడం విమర్శల పాలైంది. ఇరాన్ దగ్గర అపారమైన చమురు నిల్వలున్నాయి. హార్ముజ్ జలసంధిపై ఇరాన్‌దే ఆధిపత్యం. ఇప్పుడు భారత్‌కు చమురు రవాణా చేస్తున్న నౌకలపై అక్కడ క్షిపణి దాడులు జరుగుతున్నాయి. ఇలా ఇరాన్‌ను వ్యూహాత్మకంగా దూరం చేసుకోవడంతో ఇప్పుడు దేశం మెడకు సమస్యల ఉచ్చు బిగిస్తున్నది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడి జరిపితే ఎదురయ్యే పరిణామాల్లో చమురు, సహజవాయువు కొరత ముఖ్యమైనదని ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. దేశ చమురు అవసరాల్లో 90 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉన్నప్పుడు మరింత అప్రమత్తత అవసరం. కానీ కేంద్ర ప్రభుత్వం చమురు దిగమతుల విషయంలో బయటి ఒత్తిళ్లకు తలొగ్గి ఊగిసలాట ధోరణి ప్రదర్శించడం మనం చూస్తున్నాం. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు విషయంలో అమెరికా దాష్టీకం ప్రదర్శిస్తున్నది. ఇది దేశ సార్వభౌమాధికారానికి సవాల్‌గా మారింది. ప్రపంచ మార్కెట్లను స్థిరీకరించడానికి అమెరికా ఇప్పుడు భారతదేశం మళ్లీ రష్యన్ చమురును దిగుమతి చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నది. అయతే గతంలోలాగా చమురు ధరలపై రాయితీలు ఉండబోవని రష్యా స్పష్టం చేయడంతో భారత్ పరిస్థితి ఇరకాటంలో పడింది. ఇలా అగ్రరాజ్యాల ఆటలో పావుగా మారడం భారత్‌కు ఏమాత్రం క్షేమకరం కాదు.

# మానవ విలువల కథా దర్పణం






ఉత్తరాంధ్రలో తొలి తరం కథకులుగా నలుగురిని చెప్పుకోవచ్చు. గురజాడ, చాసో, రావిశాస్త్రి, కాళీపట్నం. ఐతే వీరందరూ భిన్న కాలాలకు చెందినవారు. గురజాడ 1910లో 'దిద్దుబాటు' కథను ప్రచురిస్తే, కాళీపట్నం 'యజ్ఞం' 55ఏళ్ళ తర్వాత వచ్చింది. 1960 దశాబ్ది తర్వాత ఎంతో మంది ఉత్తరాంధ్ర కథకులు వారివారి సృజనాత్మక నైపుణ్యంతో వైవిధ్య భరితమైన ఇతివృత్తాలతో తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఆ కోవలోని విలక్షణ కథకులు బెహరా వెంకట సుబ్బారావు. "మేం చదువుకొనే రోజుల్లో ఎన్నో శవాల్ని కోసి చూశాం! అవి ఏ కులానికి చెందినవో తెలీదు. అది మా కనవసరం. అందరి శరీరాలు ఒక్కలాగే ఉంటాయి. స్నానం చేయమని మీరెప్పుడూ దండించలేదు. స్నానం రెండు పూటలా చేస్తాను కాబట్టి. కానీ మీరన్నట్టు వారెవరినో తాకినందుకు కాదు. శవాల్ని ముట్టినందుకూ కాదు! శరీర పరిశుభ్రత కోసం! ఆత్మశుద్ధి లేని ఆచారం ఎందుకు చెప్పండి?" అని ఒక పాత్రచేత ఒక కథలో కథకుడు పలికించిన మాటలు ఆయన వ్యక్తిత్వాన్ని మానవీయ గుణాన్ని ప్రతిబింబిస్తాయి. బెహరా కథల్లో ప్రగతిశీల భావాలను, నాటి సమాజం పోకడలపై ఆయన అవగాహనను, ప్రధానంగా మధ్యతరగతి జీవితాలపై నిశిత పరిశీలనను చూడవచ్చు. ఇటీవల వెలువడిన బెహరా వారి కథా సంపుటి 'మధ్యతరగతి మందహాసం'లో 73 కథలు, 'నిశ్శబ్ద సంగీతం' నవల, 'దారి తప్పకు అనే బాలల కథ చోటు చేసుకున్నాయి. 1935 జూన్ 6 తేదీన తూర్పు గోదావరి జిల్లా పిడపర్తి గ్రామంలో బెహరా విజయలక్ష్మి, సత్యనారాయణ దంపతులకు జన్మించిన సుబ్బారావు తపాలా శాఖలో ఉద్యోగం చేసి హెడ్ పోస్టుమాస్టర్‌గా పదవీ విరమణ చేశారు. 1957 నుంచి మొదలుపెట్టి సుబ్బారావు రాసిన రచనలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, జ్యోతి, విజయ, స్వాతి, మయూరి, విజయ, నీలిమ, భారతి, యువ, యోజన మొదలైన పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వీరి కథలు ఆకాశవాణిలో కూడా ప్రసారమయ్యాయి. ఏ మనిషికైనా ప్రాణం విలువ ఒకటే. డబ్బులు కోసం ఒక పేదవాడి భార్యకు ఆపరేషన్ చెయ్యలేదు డాక్టర్. అదే డాక్టర్ భార్య ప్రాణాపాయ స్థితిలో ఉంటే రిక్షా లాగి సమయానికి ట్రైన్‌కి అందించాడు ఆ రిక్షా కార్మికుడు. ధనం కన్నా మానవత్వం ఎంత గొప్పదో చెప్పే 'ప్రాణం ఖరీదు' కథ 1986లో భారతిలో వచ్చింది. 'ఇంట గెలుపు' దళిత సమస్యపై రాసిన కథ. అంటరానితనంపై ఒక దళిత యువకుడు కొత్త పద్ధతిలో చేసిన పోరాటం ఒక కోణమైతే, దళితుల్లోనే ఒక జాతి ఇంకో జాతిని తక్కువగా చూసే స్థితి మరో కోణం. ఇవాళ్టి వర్గీకరణ సమస్య మూలాలు ఈ కథలో పరోక్షంగా ప్రస్తావనకు వచ్చాయి. ' విలువలు' శీర్షికన రెండు కథలు వచ్చాయి. మధ్యతరగతి కుటుంబాల్లోని అన్నదమ్ముల అనుబంధాన్ని చిత్రీకరిస్తూ తనకు సాయం చెయ్యని తమ్ముణ్ణి సమయానికి ఆదుకున్న అన్నయ్య కథ ఒకటి అయితే, మరో కథలో "మనిషికి విలువ లేదండి! అతని మాటకే విలువండి" అని టాక్సీ డ్రైవర్ ఓబులేసుతో చెప్పిస్తూ మాటకు కట్టుబడడం ఎవరికైనా జీవితంలో ఒక గొప్ప విలువ అని, ఆ విలువను పాటించడానికి చదువు హోదాలతో పని లేదని మరో 'విలువలు' కథలో కనిపిస్తుంది. 'ఆంతర్యం' కథ మనుషుల స్వభావాల్లోని వైచిత్రిని చూపిస్తుంది. కోడలిపై ప్రేమ, అభిమానం ఉన్నా తన అత్త తనను సాధించేది గనక తానూ కోడల్ని ఏదో అంటూ ఉండాలని అనుకునే అత్తగారి ఆంతర్యం, స్వంత ఊరికి బదిలీ అడిగితే తాను ఇతర రాష్ట్రాల్లోనూ పనిచేశానని తన కష్టాలు చెప్పుకొని కింది ఉద్యోగి అడిగిన బదిలీకి అంగీకరించని అధికారి ఆంతర్యం ఒక్కటే. 'తన దాకా వస్తే' కథ హక్కులు ప్రభుత్వ ఉద్యోగులకే కాదు పని మనుషులకూ ఉంటాయని చెబుతోంది "నేనూ మీలాంటి మడిసినే. ఒంట్లో సుకంగా లేకపోతే అయ్యగారు ఆఫీసు కెళ్తున్నారేటి? సెలవు పెడ్తున్నారు అలాగే నేనూను," అంటుంది పని మనిషి. తనను మానిపిస్తే ఇంకొకరిని రాని వ్వనంటుంది. "కట్నాలు బేరమాడే వాళ్లంటే నాకు నచ్చదు. నాన్నగారూ. అలాంటి వారిని చూస్తే అసహ్యం," అని తెగేసి చెప్పి నిజాయితీ పరుడైన ఆనందారావుకి రెండో భార్యగా అతడి పిల్లలకు తల్లిగా ఉంటూ తన మాతృత్వాన్ని త్యాగం చేసిన స్త్రీ పాత్రను 'మాతృమూర్తి' కథలో చిత్రించారు. మరణించిన వాడిది ఏ కులం అని చర్చించిన పెద్దలు, బడుగు వర్గాల్లోనూ ఐక్యత లేకుండా తమలో తాము జాతి భేదాలు పాటించే దుస్థితిని చిత్రిస్తూ కొందరు యువకులు గ్రామంలో తీసుకు వచ్చిన సామాజిక విప్లవాన్ని 'నదీనాం సాగరో గతి' కథలో ఆవిష్కరించారు. తన కొడుక్కి యోగ్యతకు మించి సహాయం చేసి ఉద్యోగ ధర్మానికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని ఒక పేద ఉపాధ్యాయుడు అధికారంలో ఉన్న శిష్యుడికి చెప్పడం 'కర్తవ్యం' కథ. దాంపత్య జీవితానికి సంబంధించిన కథలు, సాధారణ మానవుల్ని కలవరపరిచే సమస్యలపై కథలు... ఏ వస్తువు తీసుకున్నా ఒక నైతిక సందేశం, విలువల ప్రబోధం అంతర్లీనంగా మానవతావాదం ప్రవహిస్తూ బెహరా గారి కథలు ఏ కథకా కథ విశిష్టంగా గోచరిస్తుంది. సిద్ధాంత రాద్ధాంతాలతో నిమిత్తం లేకుండా తన చుట్టూ ఉన్న మనుషుల్ని సరైన కోణంలో అవగాహన చేసుకొని తెలుగుదనం ఉట్టిపడేలా సరళమైన శైలిలో ఆద్యంతం చదివించే కథలు బెహరావారివి.

# గల్ఫ్ యుద్ధం.. సమస్యల సుడిగుండం




ఒక దేశంలో జరిగిన సంఘటన మరొక దేశంలో ఆర్థిక ప్రభావాన్ని చూపుతుంది. గల్ఫ్ ప్రాంతంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇరాన్–గల్ఫ్ ఉద్రిక్తతలు, చమురు సరఫరా మార్గాల్లో ఏర్పడిన ప్రమాదాలు, సముద్ర మార్గాల్లో అస్థిరత వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ ప్రభావం నుంచి భారతదేశం కూడా మినహాయింపు కాదు. ఆయిల్ ధరల పెరుగుదల నుంచి రైతుల పంట ధరల పతనం వరకు అనేక రంగాలు ఈ సంక్షోభంతో కుదేలవుతున్నాయి.

పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు, వస్తువుల ధరలు పెరుగుతాయి. దీనివల్ల ద్రవ్యోల్బణం మరింత ఎక్కువవుతుంది. మన దేశం ఉపయోగించే ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీలో పెద్ద భాగం గల్ఫ్ దేశాల నుంచే వస్తున్నది. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు ఏర్పడితే ఈ సరఫరా వ్యవస్థ వెంటనే ప్రభావితమవుతుంది. సముద్ర మార్గాల్లో ప్రమాదాలు, షిప్పింగ్ ఖర్చులు పెరగడం లేదా సరుకు రవాణా ఆలస్యం కావడం వల్ల గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీనివల్ల దేశంలోని అనేక పరిశ్రమలు దెబ్బతింటాయి. ఫర్టిలైజర్ ప్లాంట్లు, కెమికల్ ఇండస్ట్రీలు, పవర్ ప్లాంట్లు వంటి రంగాలు గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. ఈ రంగాలకు సరఫరా తగ్గితే ఉత్పత్తి కూడా తగ్గిపోతుంది. చివరికి వ్యవసాయ రంగంపై కూడా దీని ప్రభావం పడుతుంది. ఫర్టిలైజర్ తయారీ తగ్గిపోతే మార్కెట్‌లో ఎరువుల కొరత ఏర్పడుతుంది. ఫలితంగా ఎరువుల ధరలు పెరుగుతాయి. చివరకు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చు పెరిగి ఆహార ధాన్యాల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. చమురు ధరలు పెరిగినప్పుడు భారతదేశానికి ఒక ముఖ్యమైన సమస్య రూపాయి విలువ తగ్గడం. భారత్ తన అవసరాల కోసం భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్నది. చమురు ధరలు పెరిగితే మరింతఎక్కువ డాలర్లు అవసరం అవుతాయి. దీంతో డాలర్‌కు డిమాండ్ పెరిగి రూపాయి విలువ క్రమంగా తగ్గుతుంది. రూపాయి విలువ తగ్గితే విదేశాల నుంచి దిగుమతి చేసే ప్రతి వస్తువు ఖరీదవుతుంది. గల్ఫ్ దేశాలు భారతదేశానికి ఒక అత్యంత ముఖ్యమైన ఎగుమతి మార్కెట్. భారత్ నుంచి పంపే మొత్తం ఎగుమతుల్లో దాదాపు 17 శాతం గల్ఫ్ ప్రాంతానికి వెళ్తాయి. ముఖ్యంగా బాస్మతి బియ్యం, టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రొడక్ట్స్, ఎలక్ట్రానిక్స్, నిర్మాణ సామగ్రి వంటి అనేక వస్తువులు గల్ఫ్ దేశాల్లో మంచి డిమాండ్ కలిగి ఉంటాయి. అయితే ప్రస్తుతం ఆ ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు ఏర్పడితే సముద్ర మార్గాలు ప్రమాదకరంగా మారుతాయి. గల్ఫ్ దేశాల మరో ముఖ్యమైన అంశం అక్కడ పనిచేస్తున్న లక్షలాది భారతీయులు. గల్ఫ్ ప్రాంతంలో నిర్మాణ రంగం, సేవా రంగం, ఆయిల్, గ్యాస్ పరిశ్రమల్లో పెద్ద సంఖ్యలో భారతీయ కార్మికులు పనిచేస్తున్నారు. వారు ప్రతి సంవత్సరం తమ కుటుంబాలకు పంపే డబ్బు భారత ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమైన ఆదాయం. 202425 సంవత్సరంలో విదేశాల నుంచి భారత్‌కు వచ్చిన మొత్తం రెమిటెన్సెస్ దాదాపు 135 బిలియన్ డాలర్లు. ఇందులో గణనీయమైన భాగం గల్ఫ్ దేశాల నుంచే వచ్చింది. గల్ఫ్ ప్రాంతంలో జరిగే యుద్ధ ప్రభావం చమురు ధరల నుంచి ప్రారంభమై ఎగుమతులు, ఉద్యోగాలు, కుటుంబాల ఆదాయం వరకు అనేక స్థాయిల్లో భారత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. గల్ఫ్ సంక్షోభం ప్రభావం కేవలం పెద్ద పరిశ్రమలపైనే కాకుండా రైతులపై కూడా పడుతున్నది. ముఖ్యంగా దక్షిణాది కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు కొబ్బరి సాగుకు ప్రసిద్ధి. ఈ రాష్ట్రాల నుంచి గల్ఫ్ దేశాలకు పెద్ద మొత్తంలో కొబ్బరి ఎగుమతి అవుతుంది. యుద్ధం కారణంగా ఎగుమతులు నిలిచిపోవడంతో కోట్లాది రూపాయల విలువైన కొబ్బరి కంటెయినర్లు ముంబై, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే నిలిచిపోయాయి. యుద్ధం తాత్కాలిక సమస్యలా కనిపించినా దీని ప్రభావం చాలాకాలం ఉంటుంది. స్టాక్ మార్కెట్‌లో అస్థిరత పెరుగుతుంది. పెట్టుబడిదారులు కొత్త పెట్టుబడులు పెట్టడానికి భయపడతారు. విమానయాన రంగానికి కూడా భారీ నష్టం వాటిల్లుతుంది. కార్ల్ వాన్ క్లాజ్‌విట్జ్ అనే జర్మన్‌లోని ప్రష్యన్ సైనిక కమాండర్ 'యుద్ధం అనేది రాజకీయాలను ఇతర మార్గాల ద్వారా కొనసాగించడమే' అని అన్నాడు. ఈ వాక్యం ప్రపంచ రాజకీయాల సారాంశాన్ని చెప్పేస్తుంది. దేశాలు తమ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను సాధించడానికి యుద్ధాన్ని ఒక సాధనంగా ఉపయోగిస్తాయి. కానీ యుద్ధం ప్రారంభించిన దేశాలు చివరికి సాధారణ ప్రజల జీవితాలను నాశనం చేస్తాయి. యుద్ధం అనేది కేవలం సైనికుల మధ్య జరిగే పోరాటం మాత్రమే కాదు, అది సామాన్య ప్రజల జీవన విధానాన్ని పూర్తిగా మార్చే సంఘటన.

# గిరిజన దరఖాస్తులు అందుకుంటున్న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్..



భద్రాచలం16 మార్చి నిర్భయ వార్త ప్రతినిధి: గిరిజన దర్బార్ లో అర్జీలు పెట్టుకునే ప్రతి దరఖాస్తుదారునికి ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట అధికారి బి. రాహుల్ అన్నారు.సోమవారం నాడు ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ట్రైకార్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కొరకు, కొత్తగా ఏర్పాటు చేసే మత్స్యకార సొసైటీల అనుమతి కొరకు, వ్యవసాయానికి సంబంధించి కరెంటు, బోరు, మోటారు కొరకు, గిరిజన గ్రామాలలో విద్యుత్ సౌకర్యం కల్పించుట కొరకు, మరియు జీవనోపాధి పెంపొందించుకోవడానికి వ్యక్తిగత రుణాలు ఇప్పించుట కొరకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి పొందుటకు శిక్షణలు ఇప్పించుట కొరకు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, మరియు కళ్యాణ లక్ష్మి, రైతు బంధు, ఒంటరి మహిళ లకు ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్ లు, పెట్టుకోవడానికి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించుట కొరకు, సోలార్ ద్వారా తమ పంట పొలాలలో విద్యుత్ సౌకర్యం కల్పించుట కొరకు, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం అందించుట కొరకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు.

గిరిజన దర్బార్ లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్లో ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, ఏడిఎంహెచ్వో సైదులు, ఏవో సున్నం రాంబాబు, ఎఫ్ డి సి ఉదయ కుమార్, డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, డిఎస్ఓ ప్రభాకర్ రావు, ఎల్ టి ఆర్ డి టి నాగేశ్వరరావు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, హెచ్ ఈ ఓ లింగా నాయక్, హౌసింగ్ ఏఈ హేమంత్, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది నరేందర్, మోహన్, ముత్తయ్య, చలపతి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిని బి.రాహుల్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన దామోదర్..



భద్రాచలం 16 మార్చి నిర్భయవార్త ప్రతినిధి: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి దామోదర్ రావు అర్చక స్వాములు సోమవారం నాడు పివో చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణము మరియు పట్టాభిషేకం ఉత్సవాలకు రావాలని అధికారికంగా ఆహ్వానం పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ, సీతారామచంద్రస్వామి కళ్యాణం పట్టాభిషేకం వంటి మహత్తర ఆధ్యాత్మిక పర్వదినాలు ప్రజలలో భక్తి, శ్రద్ధ, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం మరియు పట్టాభిషేకం ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఘనంగా నిర్వహించాలని దేవస్థాన అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యంగా ఆలయ ఆచారాలు, పూజా విధానాలు, ఉత్సవ కార్యక్రమాలు పురాతన సంప్రదాయాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా, ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, దర్శన సౌకర్యాలు, శాంతి భద్రతలు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భవాని రామకృష్ణ, అమరవాది రామాచార్యులు, ఎస్ టి జి కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కనీస వేతనం అమలు చేయాలి

**అసెంబ్లీ సమావేశాల్లో ' ఆశా' ల సమస్యల గురించి చర్చించాలి సిఐటియు నాయకులు నరేంద్ర.**



సింగరేణి మార్చి 16 నిర్భయవార్త రిపోర్టర్. :అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ సమస్యలపై చర్చించాలని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశ వర్కర్స్ నిరసన తెలియజేసి మెడికల్ ఆఫీసర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కే నరేంద్ర మాట్లాడుతూ ఆశా వర్కర్స్ కి 18000 ఫిక్స్ వేతనం చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కనీస వేతనాన్ని అమలు చేయాలని, ఆశ వర్కర్స్ కి రిటైర్మెంట్ బెనిఫిట్స్ చట్టం చేయాలని, ఇన్సూరెన్స్, పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్ బిల్లులు ను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఆశా వర్కర్స్ ను పర్మినెంట్ చేయాలని, ఆశా వర్కర్స్ పై వేధింపులు ఆపి, ఉద్యోగ భద్రత కల్పించాలని కే నరేంద్ర హెచ్చరించారు. రేపు కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా, ఈనెల 26వ తారీకున చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధ, మండల అధ్యక్ష కార్యదర్శులు వాంకుడోత్ కమల, పద్మ, కళ్యాణి, సరస్వతి, చంద్రమ్మ, నాగలక్ష్మి, దేవ కరుణ, నాగమ్మ, ఆ. పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ఎన్నిక

**ఉపాధ్యక్షుడిగా వీరస్వామి,ప్రధాన కార్యదర్శిగా మేదరి వీర ప్రతాప్ ఎన్నిక.**





సింగరేణి మార్చి 16 నిర్భయవార్త రిపోర్టర్: సింగరేణి మండల పరిధిలోని 41 గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సూచనల మేరకు శ్రీ కోట మైసమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేయగా సర్పంచుల ఫోరం అధ్యక్ష , ఉపాధ్యక్షులు ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్షులుగా గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మూతి వీరస్వామి రేగులగూడెం , గౌరవ అధ్యక్షులు బానోత్ రాందాస్ సూర్య తండా, ప్రధాన కార్యదర్శి మేదరి వీర ప్రతాప్ సింగరేణి, కార్యదర్శి గా విజయ్ కుమారి , కోశాధికారిగా ఉమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా ఎన్నికైన భూక్యా రంజిత్ కుమార్ కు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పాలి

**రిషి యూబీఆర్ ఉమెన్స్ కాలేజీలో అవగాహన కార్యక్రమం.. విద్యార్థులతో ప్రతిజ్ఞ**





కూకట్పల్లి నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం కూకట్పల్లిలోని రిషి యూబీఆర్ ఉమెన్స్ కాలేజీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్ బి. రాజేందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి, నీరు, జీవ వ్యవస్థలపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను వివరించారు. నిత్యజీవితంలో ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులను తగ్గించడం అత్యవసరమని, వాటికి బదులుగా పర్యావరణానికి అనుకూలమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు.సుమారు 200 మంది విద్యార్థులు అవగాహన సదస్సులో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై చర్చలు జరిపారు.అలాగే క్విజ్ కార్యక్రమం నిర్వహించి పర్యావరణ అంశాలపై అవగాహన పెంపొందించారు. కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని తెలియజేసే పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమం ముగింపులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరాకరించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు భార్గవి, పర్యావరణ విభాగానికి చెందిన సిబ్బంది, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

**జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి ఆదేశం**






మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ, వాటిని జాప్యం లేకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 125 దరఖాస్తులను డిప్యూటీ కలెక్టర్ మాలతితో కలిసి జిల్లా అధికారులు స్వీకరించారు. ప్రజలు ఎంతో వ్యయం, ప్రయాసలు పడుతూ తమ సమస్యలు పరిష్కరించబడతాయనే నమ్మకంతో అధికారులను ఆశ్రయిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులందరిపైన ఉందని ఆమె తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును వెంటనే పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను అర్జీదారులకు తప్పనిసరిగా స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుజాత, ఎఫ్ డ జి సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, ప్రాజెక్టు డైరెక్టర్ (హౌసింగ్) రమణమూర్తి, డీఆర్డీఏ సాంబశివరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో ఇంగ్లీష భాషా పరిజ్ఞానం పెరిగేలా పకడ్బందీగా ఎప్రీ చైల్డ్ రీడ్స్ అమలు: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మం, మార్చి 16 నిర్భయవార్త రిపోర్టర్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు (దివ్యాంగులైన) అన్ని రకాలుగా శిక్షణ, సహకారం అందించి సాధారణ పిల్లలకు సమానంగా తీర్చిదిద్దడమే భవిత కేంద్రం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం వైరా నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కొణిజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ గల భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా మెరుగైన మౌళిక సదుపాయాలతో రూపొందించిన పురోగతి పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. వాల్, పెయింటింగ్, బలహీనమైన పిల్లలకు ఫిజియోథెరపీ, వినికిడి, స్పీచ్ థెరపీ మిషనరీ, కృత్రిమ పరికరాలతో అక్కడ విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు మెరుగుపరచాలని, వివిధ బోధన ఉపకరణాలతో నాణ్యమైన విద్యను అందించి వారి మానసిక అభివృద్ధికి కృషి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొణిజర్ల మండలం చిన్న మునగాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే ఎప్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు, మూడవ తరగతి గదులలో విద్యార్థులు ఇంగ్లీషు అక్షరాలు, పదాల ఉచ్చారణను కలెక్టర్ చదివించారు. అదే ప్రాగణంలో ఉన్న ఆంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు, గర్భిణి మహిళలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం, కోడిగుడ్లు అందించాలని సిబ్బందికి సూచించి, రికార్డు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా విధానం ద్వారా దివ్యాంగులైన పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. చిన్న వయసులోనే ఈ కేంద్రాల్లో చేర్పించడం ద్వారా తల్లిదండ్రుల అవసరం లేకుండా వారి పనులు వారే చేసుకునే స్థాయికి చేరుకుంటారని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ప్రభుత్వ అంధుల, బధిరుల పాఠశాల, భవిత కేంద్రాల్లోని దివ్యాంగులైన పిల్లల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామని, కావాలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆధునిక యంత్రాలు, వసతులతో వివిధ వైకల్యం కలిగిన శారీరకంగా బలహీనమైన వారికి ఫిజియోథెరపీ, మాటలు రాని వారికి స్పీచ్ థెరపి ఇప్పించడం, వినికిడి సక్రమంగా లేని పిల్లలకు వినికిడి పరికరాలు, ప్రత్యేకమైన బోధన ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. భవిత సెంటర్ లలో ప్రతిపాదించిన అభివృద్ధి పురోగతి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, దివ్యాంగ విద్యార్థులకు అనుకూలంగా భవిత సెంటర్లను తీర్చిదిద్దాలని తెలిపారు. అధికారులు అంగన్వాడీ, భవిత సెంటర్ ప్రభుత్వ అభివృద్ధి పనులు, భవనాలు, పాఠశాలల్లో కిచెన్ షెడ్, శౌచాలయాల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. అదే విధంగా నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా గుత్తేదారులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. శిధిలావస్థ లో ఉన్న అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాల భవనాలను గుర్తించి వాటి స్థానంలో నూతనంగా మంజూరైన భవనాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏ విషయంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, పాఠశాల ఆదనపు తరగతి గదులు నిర్మాణాల ఏర్పాటులో జాప్యం చేయకూడదని ఇదివరకే అనుమతులు ఇచ్చిన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎప్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ ప్రవీణ్ కుమార్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, కొణిజర్ల మండల విద్యాధికారి అబ్రహం, హెడ్ మాస్టర్ నాగమల్లేశ్వర రావు, ఏఈ సురేష్, సర్పంచ్ పూనాటి బాబురావు, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం..



భద్రాచలం 16 మార్చ్ నిర్భయవార్త ప్రతినిధి: జిల్లా కలెక్టర్ ఆదేశముల మేరకు భద్రాచలం తాసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగినదని తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నాడు తన చాంబర్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భద్రాచలం రెవెన్యూ పరిధిలోని ప్రజలు వివిధ సమస్యల కొరకు దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో ముఖ్యంగా గ్రామ పంచాయతీ, ఎలక్ట్రికల్, రెవిన్యూ శాఖ మరియు ఇందిరమ్మ ఇండ్లకు సంబందించిన అర్జీలు (03) దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, వాటిని పరిశీలించి వీలైనంత తొందరగా సమస్యలు పరిస్కారం కొరకు ఆయా శాఖలకు పంపించడం జరిగిందని, రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయడం జరిగిందని, ప్రజలు పెట్టుకున్న అర్జీలు పరిస్కారం దిశగా విచారణ జరిపి దరఖాస్తుదారినికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన అన్నారు. ఇకనుండి ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వ శాఖలలో ఏవైనా సమస్యలు ఉంటే మధ్య దళారులను ఎవరిని నమ్మకుండా నేరుగా ప్రజావాణి ద్వారా పరిష్కరించుకోవాలని, మండల స్తాయి అధికారులు ప్రజావాణి యందు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్, విద్యుత్ శాఖ మరియు ఐకెపి, వైద్య శాఖ, ఎంపీడీవో కార్యాలయంనకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు...

## మొట్లగూడెం హాస్పిటల్ కు.. వాటర్ ప్యూరిఫైర్ వితరణ



సింగరేణి మార్చి 16 నిర్భయవార్త రిపోర్టర్: కీ"శే" గడిపర్తి శ్రీనివాస్ రావు జ్ఞాపకార్థం గా... గడిపర్తి రమ, గడిపర్తి వెంకటేశ్వర్లు, చింతనిప్పు రాంబాబు, సర్పంచ్ పొడుగు పెంటయ్య ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫైర్ వితరణ చేశారు.. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే మా నినాదం అంటూ ఎండల తీవ్రత దృష్ట్యా సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో వాటర్ ప్యూరిఫైర్ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు."ప్రజల దాహం తీర్చడంలో మేము ఎప్పుడూ ముందుంటాం. ఇది కేవలం మంచి నీటి పంపిణీ కాదు.. ప్రజల పట్ల మాకున్న ప్రేమ." అంటూ ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో శరీర ఆరోగ్యం పట్ల మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అరుణ, మహేష్ ,మొట్లగూడెం హాస్పిటల్ సిబ్బంది, మరియు గణేష్, సురేందర్ పాల్గొన్నారు.

## కేశవరం లో ఘనంగా ఇఫ్తార్ విందు..



## పాల్గొన్న తోటకూర వజ్రేష్ యాదవ్

మూడుచింతలపల్లి, నిర్భయ వార్త ప్రతినిధి : మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధి కేశవరం సూపర్ సంగీత్ ఫంక్షన్ హాల్ లో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం సహనం, దానం, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని అన్నారు. ఇలాంటి ఇఫ్తార్ విందులు సమాజంలో మత సామరస్యాన్ని పెంపొందించి అన్ని వర్గాల ప్రజలను ఐక్యంగా కలిపే వేదికగా నిలుస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, జిల్లా ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు బీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కంతం శిరీష కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్లు బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, రవీందర్ రెడ్డి, నాయకులు కటికల వైద్యనాథ్, వీరేశం గుప్తా, శశిధర్ రెడ్డి, జోగ్రి పోతుల నర్సింహులు, తూము వేణుగోపాల్, శ్రీకాంత్ గౌడ్ తదితర ప్రజాప్రతినిధులు,ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం





కుత్బుల్లాపూర్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లిలో గల శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ హాజరై భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులు, కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రజ లందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లి మరియు చిత్తారమ్మ దేవి అమ్మవారిని కూడా



దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతల సాయి యాదవ్, రమేష్ యాదవ్, దేవేందర్ యాదవ్, అందే మహేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు శివకుమార్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, జిమ్మీ దేవేందర్, డప్పు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జి.పి రిజిస్టర్స్ తనిఖీ చేసిన ఎంపీఓ.



సింగరేణి మార్చి 16 నిర్భయవార్త రిపోర్టర్.: సింగరేణి ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ సోమవారం మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో జి.పి రిజిస్టర్స్ ను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. జి.పి రిజిస్టర్లో పొందుపరిచిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలోనే ఇంటి పన్నులు వసూల్లో వేగవంతంగా చేయాలని శానిటేషన్, గ్రామ అభివృద్ధి పనులలో నిర్విరీయంగా చేయొద్దని గ్రామ కార్యదర్శి తెలిపారు. 99 ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీలో కార్యదర్శిలు, సిబ్బంది పనులలో నిర్లక్ష్యంగా ఉండొద్దని తెలిపారు.

# 98వ ఆస్కార్ అవార్డుల ప్రకటన




- బెస్ట్ మూవీగా వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ మూవీ
- ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడితో సహా 6 అవార్డులు
- సిన్నర్స్ మూవీకి ఐదు అస్కార్ పురస్కారాలు
- కంటికి కనిపించని భారతీయల చిత్రాలు
- ఉత్తమ నటుడిగా మైఖేల్ బి జోర్డన్
- ఉత్తమ నటిగా జెస్సీ బుక్లే

సంబురంగా 98వ ఆస్కార్ అవార్డుల పండుగ



# నటనలో.. ఆస్కార్!

ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్స్ 2026) వేడుక లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో సోమవారం తెల్లవారుజామున అట్టహాసంగా జరిగింది. ఈ ఏడాది 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' చిత్రం ఉత్తమ చిత్రంగా నిలిచి సత్తా చాటింది. ఈ సినిమా ఏకంగా 6 విభాగాల్లో ఆస్కార్ పురస్కారాలను కైవసం చేసుకుంది. రికార్డు స్థాయిలో 16 నామినేషన్లు పొందిన 'సిన్నర్స్' చిత్రం కేవలం నాలుగు అవార్డులతోనే సరిపెట్టుకుంది. పాల్ థామస్ అండర్సన్ దర్శకత్వం వహించిన 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' చిత్రానికి ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే (పాల్ థామస్ అండర్సన్), ఉత్తమ సహాయ నటుడు (సీన్ పెన్) అవార్డులు దక్కాయి. మరోవైపు, 'సిన్నర్స్' చిత్రంలో నటనకు గాను మైఖేల్ బి.జోర్డాన్ ఉత్తమ నటుడిగా నిలవగా, 'హామ్నెట్' చిత్రానికి జెస్సీ బక్లీ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. లియోనార్డో డికాప్రియో 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'లో ప్రధాన పాత్ర పోషించాడు. ఈసారి ఆస్కార్స్‌లో పలు చారిత్రక ఘట్టాలు చోటుచేసుకున్నాయి. 'సిన్నర్స్' చిత్రానికి గాను అటమ్ డ్యురాల్డ్ అర్కాపా ఉత్తమ సినిమాటోగ్రఫీ అవార్డును గెలుచుకున్నారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. అంతేకాకుండా, ఈ ఏడాదే కొత్తగా ప్రవేశపెట్టిన ఉత్తమ కాస్టింగ్ విభాగంలో 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' చిత్రానికి కాసాండ్రా కులుకుండిస్ తొలి అవార్డును అందుకున్నారు.

## 98వ అకాడమీ అవార్డుల పూర్తి జాబితా

- ఉత్తమ చిత్రం: వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
- ఉత్తమ నటుడు: మైఖేల్ బి జోర్డన్ (సిన్సర్స్)
- ఉత్తమ నటి: జెస్సీ బుక్లే (హమ్నెట్)
- ఉత్తమ దర్శకుడు: పాల్ థామస్ అండర్సన్(వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)
- ఉత్తమ సహాయ నటుడు: ఈన్ పెన్ (వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)
- ఉత్తమ సహాయ నటి: ఎమీ మాడిగన్(వెపన్స్)
- ఉత్తమ సినిమాటోగ్రఫీ: ఆటమ్ డురాల్డ్ అర్కపా(సిన్నర్స్)
- ఉత్తమ ఎడిటింగ్: యాండీ జుర్గెన్ సన్(వన్ బ్యాటిల్ అఫ్టర్ అనదర్ )
- ఉత్తమ సంగీతం: లుడ్విగ్ గోరాన్సన్(సిన్నర్స్)
- ఉత్తమ సౌండ్ : ఎఫ్ 1
- ఉత్తమ విజువల్ ఎఫెక్ట్: అవతార్ ఫైర్ అండ్ యాష్
- ఉత్తమ ఒరిజినల్ స్కోర్: సిన్నర్స్
- ఉత్తమ ఒరిజినల్ సాంగ్ : గోల్డెన్ ఫ్రమ్ కేపాప్ డీమాన్ హంటర్స్
- ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్ ప్లే: ర్యాన్ కూగ్లర్ (సిన్నర్స్)
- ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే: పాల్ థామస్ అండర్సన్(వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)
- ఉత్తమ క్యాస్టింగ్ : వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
- ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్: ఫ్రాంకిన్ స్టన్
- ఉత్తమ మేకప్ అండ్ హెయిర్ స్టయిలింగ్: ఫ్రాంకిన్ స్టన్
- ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: తమర డేవెరల్, షేన్ వ్యూ(ఫ్రాంకిన్ స్టన్)
- ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్: సెంటిమెంటల్ వ్యాల్యూ(నార్వే)
- ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్: కెపాస్ డెమన్ హంట్స్
- ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్: ది గర్ల్ హు క్రైడ్ పెరల్స్
- ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్: ది సింగర్స్, టూ పీపుల్ ఎక్స్ఛేంచ్ సలైవా
- ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్: మిస్టర్ నోబడీ ఎగనెస్ట్ పుతిన్
- ఉత్తమ డాక్యుమెంటరీ ఆర్ట్ ఫిల్మ్: ఆల్ ది ఎంప్టీ రూమ్స్



## బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో టై...

98 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో కేవలం ఏడోసారి ఒకే కేటగిరీకి ఇద్దరు విజేతలుగా నిలిచి 'టై' నమోదైంది. ఈ ఊహించని పరిణామంతో డాల్బీ థియేటర్ ఒక్కసారిగా చప్పట్లతో మార్మోగింది. వివరాల్లోకి వెళ్తే, బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డును ప్రకటించేందుకు నటుడు కుమాయిల్ నంజియాని వేదికపైకి వచ్చారు. విజేత పేరు ప్రకటించేందుకు ఎన్వలప్ తెరిచిన ఆయన, ఒక్కసారిగా మౌనంగా ఉండి పోయారు. అనంతరం, 'ఈ కేటగిరీలో టై అయ్యింది. ఇద్దరు విజేతలు ఉన్నారు' అని ప్రకటించడంతో సభలో ఆసక్తి నెలకొంది. ఈ అవార్డును 'ది సింగర్స్', 'టూ పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా' చిత్రాలు సంయుక్తంగా గెలుచుకున్నాయి.





## అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు..

బాపట్ల.నిర్భయవార్త ప్రతినిధి : ప్రాణాన్నే పణంగా పెట్టి తెలుగు జాతి అస్తిత్వాన్ని నిలబెట్టిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ముత్తయ్య పాలెంలో పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆ మహనీయునికి ఘనంగా నివాళులు అర్పించుట జరిగినది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మండల విద్యాశాఖ అధికారి బొని గల. వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆంధ్ర రాష్ట్ర కోసం పొట్టి శ్రీరాములు గారు చేసిన సేవలను కొనియాడుతూ, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు క్రమశిక్షణతో, మంచే విద్యార్థులుగా రాణించాలని కోరినారు. ఈ సందర్భంగా జరిగిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసినారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ాఖఎయిష్ట్ర చైర్పర్సన్ కర్రి అరుణ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు




## మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

మధిర మార్చి 16 నిర్భయవార్త ప్రతినిధి :మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీ



కౌన్సిలర్ షేక్ రషీదున్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో మధిర మున్సిపాలిటీ చైర్మన్ లిసామినేని సుజాతలి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తా ఆత్మ కమిటీ డైరెక్టర్ అల్లాడి గోపాలరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు మున్సిపాలిటీ కౌన్సిలర్లు ములకలపల్లి వినయ్, వెంకయ్యలపాటి నాగేశ్వరరావు, మైలవరం చక్రి, షేక్ జహంగీర్, రబ్బాని, కోన నరసింహారావు, మొదలవారు పాల్గొన్నారు

## ఘనంగా నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

మధిర మార్చి 16నిర్భయవార్త ప్రతినిధి :శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సోమవారంనాడు నాడు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు సందర్భంగా శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో కళ్యాణ మండప అధ్యక్షులు శ్రీ కురువెళ్ల కృష్ణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తదుపరి కళ్యాణ మండప



అధ్యక్షులు కురువెళ్ల కృష్ణ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను తెలిపినారు. పలువురు ఆర్యవైశ్యులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు. ఈ కార్యక్రమంలోశ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప ప్రధాన కార్యదర్శి నాళ్ళ శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు దాచేపల్లి ముత్యాలరావు, వనమా వేణుగోపాలరావుసూరి, చారు గుండ్ల నరసింహమూర్తి,పల్లపోతుల ప్రసాదరావు, కుంచం కృష్ణారావు మిరియాల రమణ గుప్త,పుల్ల ఖండం చంద్రశేఖర్, కపిలవాయి జగన్మోహన్రావు, చేడే రామకోటేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాస రావు , కొత్త మాసు వెంకటేశ్వరరావు,గార్లపాటి సత్యనారాయణ,దొడ్డ శ్రీనివాసరావు, నరసింహారావు ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా.. ఆపేదెవరు..?

### యదేచ్ఛగా పట్టపగలే అనుమతులు లేకుండా తరలింపు. చోద్యం చూస్తున్న సంబంధిత శాఖ.

సింగరేణి మార్చి 16 నిర్భయవార్త రిపోర్టర్.: సింగరేణి మండల కేంద్రంలో బుగ్గ వాగులో కొంతమంది అక్రమదారులు ఇసుక తమదేనంటూ దోచుకుంటున్నారు. యదేచ్ఛగా పట్టపగలే ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవలసిన అధికారులు పట్టించుకోకపోవడం తో హద్దు అదుపు లేకుండా ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తూ ఒక్కొక్క ట్రాక్టర్ కి 6 నుంచి 7 రూపాయలకు విక్రయిస్తున్నారు. అక్రమ రవాణా ను అడ్డుకోవలసిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ అక్రమ ఇసుక తవ్వకాలు మొదలయ్యాయని ప్రజలు తెలుపుతున్నారు.టీా 04 జుఎ 7856 వాహనం ద్వారా బుగ్గ వాగు నుంచి అక్రమ రవాణా కొనసాగుతుంది. అక్రమ రవాణా ప్రతిరోజు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇసుక అక్రమ రవాణాలో అధికారులకు ముడుపులు అందుతున్నాయా? లేక మాకెందుకులే ?అన్నట్లుగా వ్యవహార శైలి ఉన్నట్లు పలువురు తెలుపుతున్నారు. ఇప్పటికైనా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని ఈ అక్రమ రవాణా చర్యలపై అధికారులు ఉక్కు పాదం వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. అక్రమ ఇసుక తరలింపులో గేటు కారేపల్లి జి.పి.ఓ వెంకటేశ్వర్ల ను చారవాణి లో వివరణ ఖమ్మంలో ఉన్నట్లు తెలిపారు.





## అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమం

బాపట్ల. నిర్భయవార్త ప్రతినిధి :నవ్యాంధ్ర చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ మరియు . ఫోరం ఫర్ బెటర్ బాపట్ల. సంయుక్త ఆధ్వర్యంలో. నిర్వహణ బాపట్లలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ప్రధమాంధ్ర మహాసభ స్మారక విజ్ఞాన కేంద్రాన్ని .భావితరాల కోసం రాష్ట్ర ప్రభుత్వంనిర్మించాలి... సమావేశం పిలుపు"బాపట్ల టౌన్ హాల్ ప్రాంగణంలో ప్రథమాంధ్ర మహాసభ తెలుగు తల్లి పైలాన్ వద్ద. నవ్యాంధ్ర చైతన్య వేదిక . ఫోరం ఫర్ బెటర్ బాపట్ల. మరియు జన విజ్ఞాన వేదిక. సంయుక్త ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి డాక్టర్ పి సి సాయిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ. 113 సంవత్సరాల క్రితం. 1913లో ఇదే టౌన్ హాల్ ప్రాంగణంలో ఆనాడు ప్రధమాంధ్ర మహాసభ.. చారిత్రాత్మకమైనది . ఆనాటి తెలుగు జాతి మహామహులు ఎందరో పాల్గొన్నారుఅన్నారు . అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ. ఫలితమే. ఆంధ్ర రాష్ట్ర సాధన. అన్నారు.. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం. నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు. .కోట వెంకటేశ్వర రెడ్డి. తెలుగు నాట ఆంధ్రోద్యమం 5 దశలను వివరించారు . ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో . . 1913 లో. జరిగిన ప్రధమ. ఆంధ్రమహాసభ నుండి . నేడు . ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ 2026నేటి వరకు. జరిగిన 5 చారిత్రక దశలను వివరించారు. ఆనాడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో. ఒక అస్తిత్వం లేని తెలుగు ప్రజలకు .1913లో.. బాపట్లలో . జరిగిన. చారిత్రాత్మక.. ప్రధమ ఆంధ్ర మహాసభ.. ఒక . అస్తిత్వాన్ని. స్ఫూర్తి నిచ్చింది. అన్నారు.. అనంతరం . . ప్రతిఏటాఒకవైపు . ఆంధ్ర ప్రాంతంలో. మరోవైపు నైజాం పాలనలోని తెలంగాణ ప్రాంతంలోనూ రెండు.తెలుగు ప్రాంతాల్లో . ప్రతిఏటాజరిగిన .. చారిత్రాత్మక... ఆంధ్రోద్యమం మహాసభలు.... తెలుగువారిలో. భాష .సాంస్కృతిక . అస్తిత్వ ఉద్యమ చైతన్యం నింపాయి.. రెండవ దశలో ఆనాడు. మహాత్మా గాంధీ శిష్యుడుగా.. స్వాతంత్ర ఉద్యమంలో ఉన్న పొట్టి శ్రీరాములు. ఆంధ్ర ఉద్యమాన్ని అందుకొని అమరజీవి పొట్టి శ్రీరాములుఅయ్యారు.. 1952 లో. మద్రాసులో.. 58 రోజులు. ఆయన.. చేసినమహాఆమరణనిరాహార దీక్ష.... ఆయన అమరత్వంతో మరో మలుపు తిరిగి. 1953 లో కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఆ తర్వాత మూడేళ్లకు 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. 58 ఏళ్ల తర్వాత. ఉమ్మడి రాష్ట్రం 2014లో రాష్ట్ర విభజనతో ఆంధ్ర తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. . రాష్ట్ర . విభజన జరిగి . 12 ఏళ్ళు..నేడు 2026లో.. నవ్యాంధ్ర రాష్ట్రం . అమరావతిరాజధానిగా . రాష్ట్ర పునర్నిర్మాణం జరుగుతున్నది .. అమరావతి రాజధానిగా కేంద్రం ఇంకా చట్టం చేయాల్సిన అవసరం ఉంది అన్నారు ఈ దశలో. అమరావతిలో (. తుళ్లూరు లో) .. అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహం ఆయన 125వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఈ సందర్భంగా . బాపట్లలో కూడా 1913లో. బాపట్ల టౌన్ హాల్లో జరిగిన. ప్రథమాంధ్ర మహాసభ.. జరిగిన ప్రాంగణంలో ఆధునిక తెలుగుజాతి చరిత్రలో ఒక మహత్తర ఘట్టం అందుచేత బాపట్లలో టౌన్ హాల్ ప్రాంగణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో .. బాపట్లలో ప్రధమాంధ్ర మహాసభ. స్మారక విజ్ఞాన కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు ,. . ఇందుకు త్వరలో. . ఒకపూర్తిస్థాయి రూపకల్పన చేసేందుకు బాపట్ల పట్టణంలోని ప్రముఖులు..తో.. పూర్తిస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జరుగును. సోదర ప్రజా సంఘాలను. అధికారులను . సమన్వయపరచుకొని. బాపట్ల ఎమ్మెల్యే గారితో సహాప్రజాప్రతినిధులను కలుసుకొని. ఒక రూపకల్పన చేయనున్నామని డాక్టర్ పి సి సాయిబాబు మరియు కోటా వెంకటేశ్వర్ రెడ్డి సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి. 125వ. జయంతి సందర్భంగాఘనంగా నివాళులర్పించారు . ఈ కార్యక్రమంలో. డాక్టర్ పి సి సాయిబాబు,. కోట వెంకటేశ్వర రెడ్డి, కన్వీనర్ గురజాల శ్రీనివాసరావు,. తటవర్తి వెంకట సుబ్బారావు, . హేమంత్ కుమార్,బి నరసారెడ్డి ,. చిలుకూరి శర్మ . నాగ సాయిబాబు. హేమంత్,. ఆదిత్య. అమర్..,. శివ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు




## పెన్షన్లు ఇచ్చే వరకు కాంగ్రెస్ వెంటపడుతూనే ఉంటాంబిఆర్ఎస్ నేత శీలం కృష్ణారెడ్డి

మధిర రూరల్ మార్చి 16 నిర్భయవార్త ప్రతినిధి : ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెన్షన్లను పెంచాలని లేకుంటే వెంటపడుతూనే ఉంటామని బిఆర్ఎస్ నేత శీలం కృష్ణారెడ్డి అన్నారు.సోమవారం నాడుపింఛను మొత్తం పెంచాలని కోరుతూ మధిర మండలంలోని జాలిమూడి గ్రామపంచాయతీ కార్యదర్శి కి వృద్ధులు, వితంతువులు,వికలాంగులతో కలిసి నిరసన తెలిపి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ,వికలాంగుల పెన్షన్ను రూ.6 వేలకు, ఆసరా పెన్షన్ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు.రెండెళ్లు గడిచిపోయిన ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ వెంటనే పెన్షన్ ఇవ్వాలన్నారు.ప్రతిరోజూ నిత్యావసరాల ధరలు పెరుగుతున్నా పెన్షన్ను మాత్రం పెంచడం లేదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో యరమల సైదిరెడ్డి,జీడిమెట్ల నాగరాజు,వంగల బసవయ్య,జీడిమెట్ల కొండయ్య,బుస్కా కృష్ణవేణి,జీడిమెట్ల లక్ష్మి, జీడిమెట్ల అచ్చమ్మ,అయిలూరి రాములమ్మ,జీడిమెట్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ప్రతినిధులు అనునిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కరించాలి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ దీప్తి

మధిర మార్చి 16 నిర్భయవార్త ప్రతినిధి :మున్సిపాలిటీ పరిధిలో జనం



మన్ననలు పొందగలిగిన వారే నిజమైన నాయకులు అని,ప్రజా ప్రతినిధులు అనునిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చీపురుపల్లి దీప్తి అన్నారు.సోమవారం నాడు తెలంగాణ గ్రామీణ బ్యాంకు బంజారా కాలనీ శాఖ డిపాజిట్ల సేకరణలో భాగంగా ఇల్లందులపాడు వెళ్లిన బ్యాంక్ మేనేజర్ దీప్తి ఇటీవల మధిర మున్సిపాలిటీకి చైర్మన్గా నియమితులైన సామినేని సుజాత రామనాథాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుజాతని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.లాగే సామినేని సుజాత గెలుపులో కీలక భూమిక పోషించిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరావు అని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మేనేజర్ దీప్తి మాట్లాడుతూ,మధిర మున్సిపాలిటీకి మెరుగైన సేవలు అందించాలని చైర్మన్ సామినేని సుజాతని కోరారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత బ్యాంకు మేనేజర్,బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## మాటూరు గ్రామానికి చెందిన శ్రీమతి తుమ్మల ప్రసన్నా రెడ్డి కన్నుమూత



యాదాద్రి భువనగిరి జిల్లానిర్భయవార్త ప్రతినిధి :16 మార్చి: మోటకొండూరు మండలం మాటూరు గ్రామానికి చెందిన శ్రీమతి తుమ్మల ప్రసన్నా రెడ్డి కన్నుమూశారు. ఆమె మార్చి 15వ తేదీ అర్ధరాత్రి సమయంలో అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మరణవార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మరణించిన తుమ్మల ప్రసన్నా రెడ్డి గారు మాటూరు గ్రామానికి చెందిన తుమ్మల ప్రమోద్ రెడ్డి గారి సతీమణి. ఆమె కుటుంబానికి అంకితభావంతో, అందరితో స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తిగా గ్రామంలో మంచి పేరు సంపాదించుకున్నారు. ఆమె మృదుస్వభావం, సేవాభావం వల్ల గ్రామస్థులందరికీ ఆప్తురాలిగా నిలిచారు.ఆమెకు కుమారుడు తుమ్మల కీర్తి వర్ధన్ రెడ్డి ఉన్నారు. తల్లి మరణంతో కుమారుడు, కుటుంబ సభ్యులు మరియు బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామస్థులు, స్నేహితులు, బంధువులు ఆమె నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.శ్రీమతి తుమ్మల ప్రసన్నా రెడ్డి గారి మృతితో మాటూరు గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు మరియు గ్రామస్థులు ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ, బాధిత కుటుంబ సభ్యులకు గాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## కీసర మండలంలో కాంగ్రెస్ "6 హామీలు"పై బీజేపీ నేతల నిరసన

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మార్చి 16 నిర్భయవార్త ప్రతినిధి :కీసర మండలంలోని బీజేపీ నేతలు, రాష్ట్ర నాయకుల ఆదేశాల ప్రకారం, కీసర మండల తహసీల్దార్ పి. యాదగిరి రెడ్డికు మెమోరాండంను సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన "6 హామీలు" కార్యక్రమాన్ని తక్షణమే అర్హులైన అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు హోరాహోరీ నినాదాలతో పాల్గొన్నారు. వారు "6 హామీలు" ఖచ్చితంగా అమలుచేయక పోవడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలు, అమలు ఆలస్యం, ప్రజలకు రావలసిన పథకాలు అందకపోవడం వంటి అంశాలను కేంద్రంగా నిరసన వ్యక్తం చేశారు.కీసర మండల బీజేపీ నాయకులు, శ్రీనివాస్ రావు (అడ్వకేట్) మరియు ఇతర పార్టీ కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెమోరాండంలో సమర్పణలో వారు అమలులో 6 హామీలు అమలు ఎప్పుడు అమలు అవుతాయో వాటికి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఏమి ప్రయోజనం?"6 హామీలు" అమలులో తక్షణమే పలు సంక్షేమ పథకాలు ప్రజలకు లభించాలి. బీజేపీ నేతల అభిప్రాయం ప్రకారం, ప్రణాళికలో ఆలస్యాలు ప్రజల సమస్యలను పెంచే అవకాశం ఉందని వారు తెలిపారు.కీసర మండలంలో, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈ నిరసన కార్యక్రమం స్థానిక రాజకీయాల్లో హంగామా సృష్టిస్తూ, పాఠకుల దృష్టికి వచ్చింది.

## నేషనల్ లెవెల్ కుంగ్ ఫు పోటీల్లో న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థుల ఘన విజయం





షాద్నగర్ నిర్భయవార్త ప్రతినిధి : షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని ఠాగూర్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 'నేషనల్ లెవెల్ ఓపెన్ కుంగ్ ఫు కరాటే ఛాంపియన్‌షిప్' పోటీల్లో స్థానిక న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ విన్యాసాలతో అందరినీ ఆకట్టుకొని పలు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికేట్లను కైవసం చేసుకున్నారు. ?కుంగ్ ఫు మాస్టర్ బాలరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలకు వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుంగ్ ఫు గ్రాండ్ మాస్టర్ వీరాచారి హాజరై, పోటీలను పర్యవేక్షించడమే కాకుండా విజేతలకు బహుమతులు అందజేశారు. ?న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రేమ్ కుమార్, రాహుల్ కట్ట, ఫైట్ విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచి ట్రోఫీలను సొంతం చేసుకున్నారు. వీరితో పాటు అకాడమీకి చెందిన మరికొందరు చిన్నారులు కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యార్థుల ప్రతిభపై మాస్టర్ అహ్మద్ ఖాన్ హర్షం వ్యక్తం చేస్తూ, విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## కమ్మదనం సర్పంచ్ కె. నరసింహులు కు బహుజన సాహితి అకాడమీ అవార్డు ఎన్నం నారాయణరెడ్డికి కర్షకరత్న అవార్డు.



షాద్నగర్ నిర్భయవార్త ప్రతినిధి :గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడుపుతూ గ్రామస్తుల కలలను సహకారం చేసిన ఫరూక్ నగర్ మండలం కమ్మదనం గ్రామ మాజీ సర్పంచ్ కె. నరసింహులు దక్కించుకున్నారు. ఈనెల 15వ తేదీన తిరుపతిలో జరిగిన బహుజన సాహితీ అకాడమీ వారి 2025వ సంవత్సర ఉత్తమ సర్పంచ్ గా ఆయన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులను గ్రామస్తుల కు అండగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. బహుజన సాహితీ అకాడమీ పురస్కారానికి తనని ఎంపిక చేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ అన్నదాత అయ్యాడు కర్షకరత్న ఎన్నం నారాయణరెడ్డికి కర్షకరత్న అవార్డ నాగలి పట్టి పొలం దున్ని సేద్యం ద్వారా అసాధ్యాలను సుసాధ్యం చేసిన రైతు నారాయణరెడ్డిని కర్షకరత్న పురస్కారం వరించింది. బహుజన సాహితీ అకాడమీ ద్వారా ఆయన ఈ పురస్కారాన్ని పొందారు. ఈనెల 15వ తేదీన తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. దీనిపై స్పందిస్తూ సేద్యం ద్వారా ముందుకు సాగి సమాజానికి ఎంతో కొంత ఉ పయోగపడుతున్న నేపథ్యంలో ఇలాంటి పురస్కారాలు ఎంతో ఆత్మ సంతృప్తిని ఇస్తాయని ఆయన వెల్లడించారు. తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన వారి కి కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పై, వచ్చినఆరోపణలనుతీవ్రంగాఖండిస్తున్నాము.

సూళ్లూరుపేట అర్బన్, నిర్భయవార్త ప్రతినిధి : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట వైసిపి పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కెలివేటి సంజీవయ్య పై 786 రఫీ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, కిలివేటి సంజీవయ్య ను విమర్శించే స్థాయి నీది కాదని హెచ్చరించారు. మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను, నాపై చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, గత వైసిపి ప్రభుత్వంలో 786 రఫీ చేసిన కొన్ని కార్యక్రమాల వల్ల సంజీవయ్య నిన్ను దూరంగా పెట్టారు అని, నాయుడుపేటలోని షికారి లకు హామీలు ఇచ్చి వాళ్ళు ఉన్న స్థలంలో కాంప్లెక్స్ కట్టించి అదే కాంప్లెక్స్ లో ఒక రూమును తీసుకొని వైన్ షాప్ నడుపుతున్నది నువ్వు కాదా అని ఎద్దేవా చేశారు. దొరవారి సత్రం మావిళ్ళపాడు వద్ద ఉన్న ఇసుక రీచ్ ను కూటమి ప్రభుత్వం వచ్చిన రాత్రికి రాత్రే అమ్ముకున్నది నువ్వు కాదా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుపాకుల ప్రసాద్, మాదరపాక సురేష్, చిలక యుగంధర్ మరియు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి: తహసీల్దార్‌కు బీజేపీ నేతల వినతి.



మంచిర్యాల మార్చి 16, నిర్భయవార్త ప్రతినిధి : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పట్టణ కమిటీ తరఫున సోమవారం మంచిర్యాల పట్టణ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర ఉ పాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ రావు, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ వినతి పత్రం అందజేసినట్లు నాయకులు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చినా ఇప్పటివరకు వాటిలో చాలా వరకు అమలు కాలేదని వారు విమర్శించారు. యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు మరియు దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకుని ఓటు వేసిన ప్రజలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సకాలంలో అందకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు అందించాల్సిన ఆసరా పెన్షన్లు అర్హులైన వారికి అందడం లేదని, దరఖాస్తులు చేసుకున్న వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను కూడా తక్షణమే పరిష్కరించాలని కోరారు. జిల్లాలో పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు, వీధి దీపాలు వంటి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నివాస, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం జరుగుతోందని, అర్హులైన వారికి నిర్ణీత సమయంలో పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గర్మిళ్ల జోన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్ కుమార్, బోట్ల సత్యనారాయణ, 12వ డివిజన్ కార్పొరేటర్ కస్తూరి నాగరాజు, గర్మిళ్ల జోన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ ములుకాల కుమార్, గర్మిళ్ల జోన్ ప్రధాన కార్యదర్శి బింగి సత్యనారాయణ, కర్రే లచ్చన్న, మెట్టుపల్లి జయరాం రావు, వైద్య శ్రీధర్, అంకం మనోజ్, నాంపల్లి శ్రీను, రాజేంద్రప్రసాద్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## యువ కవి బైరపాక స్వామికి ఉగాది కవితా సత్కారం



యాదాద్రి భువనగిరి జిల్లా నిర్భయవార్త ప్రతినిధి : పల్లె భావజాలాన్ని పదాల్లో నింపుతూ, సమాజ సమస్యలను కవిత్వం ద్వారా వినిపిస్తున్న యువ కవి, రచయిత బైరపాక స్వామి ఉగాది కవి సత్కారం--2026 అందుకున్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రాయగిరిలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన పరాభవ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ పోలంరెడ్డి రంగయ్య ఆధ్వర్యం వహించగా, వివిధ మండలాల నుంచి కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన యువ కవి బైరపాక స్వామిని ఉగాది కవి సత్కారంతో ఘనంగా సన్మానించారు. బైరపాక స్వామి పల్లె జీవితపు అనుభవాలను పదాల్లో ఒదిగి, ఎన్నో ఫోక్ సాంగ్స్‌ను పల్లె పదునుతో రచించి, వాటికి స్వయంగా సంగీత బాణీలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. గ్రామీణ సంస్కృతి, ప్రజల జీవన విధానం, సమాజంలో ఉన్న అన్యాయాలపై ఆయన రచనలు ప్రతిబింబిస్తాయి. ఉగాది కవితా పోటీలో పాల్గొన్న ఆయన 'ఎర్రని అక్షరాలు' అనే వచన కవితను చదివి వినిపించారు. దేశభక్తి భావాలతో పాటు సమాజంలో జరుగుతున్న దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు స్వరంతో రాసిన ఈ కవిత సభికులను ఆలోచింపజేసి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది గజ్జెల రవీందర్ రెడ్డి చేతుల మీదుగా బైరపాక స్వామికి ఉగాది కవి సత్కారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి, డా. పోరెడ్డి రంగయ్య సభకు అధ్యక్షత వహించగా, డా. లింగంపల్లి రామచంద్ర, శ్రీ రామకృష్ణ విద్యాలయం ఆచార్యులు బండిరాజుల శంకర్, బండారు జయశ్రీ, శ్రీపాద శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పలువురు కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు కార్యక్రమంలో పాల్గొని బైరపాక స్వామిని అభినందించారు. ఉగాది పురస్కారం అందుకున్న సందర్భంగా బంధుమిత్రులు, తోటి రచయితలు, కళాకారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కవులు, కళాభిమానుల సందడితో కార్యక్రమం కళకళలాడింది.


## ప్రజావాణికి (52) ఫిర్యాదులు సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచన ఇచ్చిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి





ఇబ్రహీంపట్నం 16 నిర్భయవార్త ప్రతినిధి : రంగారెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు సమస్యల పరిష్కారం నిమిత్తం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి కచ్చితంగా సమాధానం ఇస్తూ తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (52) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ-- 23, ఇతర శాఖలకు -- 29, మొత్తం 52 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తండాలను అభివృద్ధి చేయడమే నా లక్ష్యం



షాద్నగర్ నిర్భయవార్త ప్రతినిధి ;: ప్రశాంతమైన తండాలలో ఇలాంటి వివాదాలు, ఘర్షణలు లేకుండా నిరాడంబరంగా జీవించే గిరిజనుల కోసం, వారి తండాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం మొండోని రాయి తండాలో రేషన్ షాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ షాప్ లేకుండా ఇక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు గిరిజన నేత సూర్య నాయక్ తన దృష్టికి తేవడం వల్లనే వెంటనే మంజూరు చేశానని వెల్లడించారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా గిరిజనులు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు షాద్ నగర్ పట్టణంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు ఏ కష్టం వచ్చినా ఇక్కడున్న శీను నాయక్, కుమార్, నెహ్రూ, సంజు, రవి లాంటి నాయకులు ఎవరికీ చెప్పిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రైతు బిడ్డ ఈరోజు ముఖ్యమంత్రి అయ్యాడని, మీలాంటి ప్రతి ఒక్కరి ఆశీస్సులతో తాను కూడా ఎమ్మెల్యేగా ఉన్నానని, తండాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని వెల్లడించారు. పార్టీలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు జరిగినా, సేవాలాల్ జయంతి లాంటి కార్యక్రమాలు అయినా గిరిజనులతోనే ఆ కార్యక్రమాలకు ప్రత్యేక కళ వస్తుందని అన్నారు. గిరిజన మహిళల సంప్రదాయ దుస్తులు తనకు ఎంతో ఇష్టమని ఆయన అన్నారు. గతంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నడుచుకుంటూ వెళుతున్న గిరిజన మహిళలను కారు ఆపి మరీ పలకరించి వారి కష్టాలు తెలుసుకొని నిరుపేదలకు పక్కా ఇల్లు కట్టి ఇవ్వాలని కార్యక్రమాన్ని ముందుకు తెచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం 10 ఏళ్లలో చేయని కార్యక్రమాలను రెండేళ్లలో చేపట్టిందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చినప్పటికీ, సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేస్తామని స్పష్టం చేశారు. గిరిజన తండాలను ఆరోజైనా, ఈ రోజైనా పట్టించుకున్నది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ బుజ్జి బాబు నాయక్, మాజీ ఎంపీటీసీ తుపాకుల శేఖర్, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సంతాపూర్ గ్రామ ఉపసర్పంచ్ అంజయ్య దుర్మరణం




షాద్నగర్ నిర్భయవార్త ప్రతినిధి :రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ ఉపసర్పంచ్ అంజయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. టమాట పంట నారు కోసం రాయలసీమలోని పెనుగొండ కు వెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. ఏం జరిగిందో తెలియదు కానీ రోడ్డు ప్రమాదంలో ఉపసర్పంచ్ అంజయ్య దుర్మరణం పాలనట్లు పేర్కొన్నారు. తను ప్రయాణిస్తున్న వాహనం మరో వాహనానికి ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదం జరిగిందని ఈ ప్రమాదంలో అంజయ్య చనిపోయినట్లు సమాచారం సంతాపూర్ గ్రామానికి చేరింది. ప్రస్తుతం సంతాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## చామకూర కల్పన మల్లారెడ్డి 50వ వివాహ వార్షికోత్సవ వేడుకలు

**సిల్వర్ జూబ్లీ సందర్భంగా బద్దం మమత జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**



ఘట్కేసర్ మార్చ్ 16నిర్భయవార్త ప్రతినిధి ::మేడ్చల్ నియోజకవర్గం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చెరుకు బాలయ్య గార్డెన్ లో మాజీ మంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి కల్పన 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవంను పురస్కరిం చుకొని పోచారం మున్సిపల్ మాజీ వార్డ్ కౌన్సిలర్ బద్దం మమతా జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా మమతా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్త్రీ ఎక్కడ గౌరవించబడుతుందో అక్కడ దేవతలు సంచరిస్తారు ప్రతి మహిళలో ఒక ప్రత్యేకమైన శక్తి దాగుంటుంది. ఆమె నవ్వు ఒక ఇంటిని వెలిగించగలదు ఆమె కన్నీరు ఒక హృదయాన్ని మార్చగలదు. ప్రతి స్త్రీ ఒక తల్లిలా, చెల్లిలా, భార్యలా మారి తన పిల్లలను కుటుంబ సభ్యులను ప్రేమగా చూసుకుంటుంది. అంతేకాదు స్త్రీ అమ్మల అమృతం కురిపించగలదు తలుచుకుంటే తరాలను మార్చగలదు అదే స్త్రీ లో ఉన్న గొప్పతనం. అందరూ స్త్రీ నీ తక్కువ చూడకుండా పురుషునితో సమానంగా గౌరవించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మరియు ఏమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ వైస్ చైర్మన్ దీప్తి రెడ్డి, జక్కా వెంకట్ రెడ్డి, బుచ్చిరెడ్డి, మంద సంజీవరెడ్డి, రవి గౌడ్, ఘట్కేసర్ మండల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# సినిమా సిత్రం




# ఆదిత్యధర్‌పై ఇండస్ట్రీ అసూయ



దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మరోసారి 'ధురంధర్' దర్శకుడు ఆదిత్య ధర్‌పై ప్రశంసలు కురిపించారు. గూఢచారి థ్రిల్లర్‌గా వచ్చిన 'ధురంధర్' చిత్రాన్ని చూసినప్పటి నుంచి ఆదిత్య ధర్ ప్రతిభ గురించి తాను తరచుగా మాట్లాడుతున్నానని ఆయన తెలిపారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆదిత్య ధర్ సినీ కథనం చెప్పే విధానాన్నే మార్చేశాడని పేర్కొన్నారు. ఆయన పనితనం వల్ల ఇప్పుడు సినిమా కథ చెప్పే వ్యాకరణమే మారిపోయిందని అన్నారు. ఇది కేవలం హిందీ సినిమాలకే కాదు, ఇతర భాషల చిత్రాలపై కూడా ప్రభావం చూపిందని వర్మ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా తెలుగు సహా అనేక భాషల్లో రూపొందుతున్న భారీ యాక్షన్ చిత్రాలు ఇప్పుడు భారీ స్థాయిలో రీషూట్లు ఎదుర్కొంటున్నాయని, దీంతో నిర్మాతలకు భారీ ఖర్చులు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల వల్ల చాలా మంది ఆదిత్య ధర్‌పై అసూయతో ఉన్నారని వర్మ వ్యాఖ్యానించారు.

# కొత్త సంస్థతో అలియాభట్ ఏం చేయబోతుంది?




బాలీవుడ్ స్టార్ అలియా భట్ కేవలం నటనకే పరిమితం కాకుండా నిర్మాతగా కూడా తన సామ్రాజ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే ఎటర్నల్ సన్ షైన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై –డార్లింగ్స్–, –జిగ్రా– వంటి వైవిధ్యమైన చిత్రాలను నిర్మించిన సంగతి తెలిసిందే. తాజాగా తన 33వ పుట్టినరోజు ను పురస్కరించుకుని –ఎటర్నల్ కిడ్స్– అనే మరో కొత్త నిర్మాణ సంస్థని ప్రారంభించి ఆశ్చర్యపరిచింది. తన మాతృ సంస్థకు ఇదొక చిన్నారి లాంటిదని, పిల్లల కోసం అద్భుతమైన కథలను అందించడమే లక్ష్యమని పేర్కొంది. అలియా భట్ ఈ కొత్త సంస్థ ద్వారా ప్రధానంగా తన బాల్యానికి సంబంధించిన జ్ఞాపకాలను, తాతయ్య నరేంద్రనాథ్ రజ్దాన్ చెప్పిన కథలను వెండితెరపైకి తీసుకురావాలని భావిస్తోంది. మా చిన్నప్పుడు మేము పెరిగిన కథలను మళ్ళీ సజీవం చేయబోతున్నాం– అంటూ ఆమె ఎమోషనల్ అయింది. ఈ కొత్త బ్యానర్‌లో ఇప్పటికే మూడు ప్రాజెక్టులు పట్టాలెక్కడం విశేషం. సీ, జీ, ఎం అనే సినిమాలను నిర్మిస్తుంది. వీటికి సంబంధించిన పేర్లను త్వరలో వెల్లడించనుంది. ఇవీ ఆమె చిన్ననాటి జ్ఞాపకాల నుంచి పుట్టిన కథలుగా తెలుస్తోంది. గతంలో –ఎటర్నల్ సన్ షైన్– ప్రారంభించినప్పుడు అలియా భట్ చాలా జోరుగా సినిమాలు తీస్తుందని అందరూ భావించారు. అయితే ఆ సంస్థ లో కేవలం పరిమితంగా ప్రయోగాత్మక చిత్రాలే చేస్తున్నారు. తాజాగా –ఎటర్నల్ కిడ్స్– ద్వారా మళ్ళీ యాక్టివ్ మోడ్‌లోకి రావడం గమనార్హం. తల్లిగా మారిన తర్వాత పిల్లల కంటెంట్ పట్ల ఆమెకు ఆసక్తి పెరిగిందని, అందుకే తన కూతురు రాహా వంటి చిన్నారులందరినీ అలరించేలా ఫ్యామిలీ–ఫ్రెండ్లీ కథలను నిర్మించడమే తన తదుపరి లక్ష్యమని అమ్మడు గత ఇంటర్వ్యూలలోనే సూచన ప్రాయంగా చెప్పింది. నిర్మాతగా అలియా కేవలం సొంత సినిమాలకే పరిమితం కాకుండా, కొత్త టాలెంట్‌ను కూడా ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం ఆమె తన సోదరి షాహీన్ భట్‌తో కలిసి అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం –డోంట్ బీ షై– అనే రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని నిర్మిస్తోంది. –జిగ్రా– వంటి సీరియస్ సినిమాల తర్వాత మళ్ళీ వినోదానికి ప్రాధాన్యతనిస్తూ, వైవిధ్యమైన జోనర్లలో తన నిర్మాణ సంస్థను పరుగులు పెట్టించాలని అమ్మడిలో గట్టి పట్టుదల కనిపిస్తోంది. ప్రస్తుతం అలియా భట్ నటిగా –ఆల్ఫా–, –లవ్ అండ్ వార్– వంటి భారీ చిత్రాల్లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. నిర్మాతగా ఎటర్నల్ కిడ్స్ ద్వారా విభిన్నమైన అభిరుచిని చాటుకుంటోంది. మొదటి సంస్థతో పోలిస్తే ఈ కొత్త విభాగం మరింత వేగంగా ప్రాజెక్టులను పూర్తి చేసేలా కనిపిస్తోంది. చిన్నపిల్లల ప్రపంచంలో అలియా సృష్టిం చబోయే మ్యాజిక్ ఎలా ఉంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాగే అలియా భట్ –ఆర్ ఆర్ ఆర్– తర్వాత తెలుగు సినిమాల్ని లైట్ తీసుకుంది. అవకాశాలు వస్తున్నా నో చెబుతుంది. అయినా అమ్మడి వెంట దర్శక, నిర్మాతలు పడుతున్నారు? దీంతో అమ్మడు అలియా టాలీవుడ్లో డిమాండింగ్ భామగానూ మారింది.

# కోకా, రైకాలో..మలైకా!



బాలీవుడ్ సీనియర్ బ్యూటీ మలైకా అరోరా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని సృష్టించుకుంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో తన స్టైలిష్ లుక్స్‌తో అభిమానుల గుండెల్లో మంటలు రేపుతోంది. ముఖ్యంగా ఆ జబ్బల రవిక (పఫ్ స్లీవ్ బ్లౌజ్), కాంబినేషన్ డిజైనర్ కోకలో మల్లా మెరిసిపోతున్న తీరు కేక పెట్టించేలా ఉంది. సాంప్రదాయ చీరకట్టుకు మోడ్రన్ టచ్ ఇస్తూ మలైకా చేస్తున్న ఈ ఫ్యాషన్ ప్రయోగాలు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఇది గౌరి అండ్ నైనిక డిజైనర్ శారీ. ప్రస్తుతం 52 ఏళ్ల వయసులో ఉన్నా కానీ..మలైకా తన ఫిట్‌నెస్‌తో నేటి తరం హీరోయిన్లకు గట్టి పోటీనిస్తోంది. వయసు అనేది కేవలం ఒక నంబర్ మాత్రమేనని నిరూపిస్తోంది. బికినీలు, స్విమ్ వేర్లలో ఎంతటి గ్లామర్‌ను చిందిస్తుందో.. చీరకట్టు వంటి ట్రెడిషనల్ అవతారాల్లో అంతే హుందాతనాన్ని ప్రదర్శిస్తోంది. మలైకా ఫ్యాషన్ సెన్స్ నుండి నేటితరం నేర్చుకోవాల్సింది ఏమిటంటే.. బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా దుస్తులను ఎంపిక చేసుకోవడం..

# రాప్తార్ పైనే కీర్తి ఆశలు

## హిట్ కొడితేనే బాలీవుడ్‌లో ఛాన్స్ లు




టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులకు తన నటనతో దగ్గరైన మహానటి కీర్తి సురేష్ బాలీవుడ్‌లోకి భారీ అంచనాలతో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. వరుణ్ ధావన్ హీరోగా నటించిన 'బేబీ జాన్' చిత్రంతో హిందీ వెండితెరకు పరిచయమయ్యారు. ఒక సాలిడ్ యాక్షన్ డ్రామాగా, గ్లామరస్ ఎంట్రీగా భావించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేక డిజాస్టర్‌గా మిగిలిపోయింది. దీంతో కీర్తి సురేష్ బాలీవుడ్ ఆశలు అడియాసలయ్యాయి. దాంతో లాంగ్ గ్యాప్ తీసుకుని మరోసారి బాలీవుడ్ లో అదృష్టం పరీక్షించుకోనుంది కీర్తి సురేష్. తన రెండో హిందీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. టాలెంటెడ్ నటుడు రాజ్ కుమార్ రావు హీరోగా, కీర్తి సురేష్ హీరోయిన్‌గా 'రాప్తార్' అనే సినిమాలో నటిస్తోంది. సైలెంట్ గా షూటింగ్ ఫినిష్ చేసుకున్న ఈ సినిమా విడుదలకు ముస్తాబైంది. ఈ సినిమా మేకర్స్ తాజాగా రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. దర్శకుడు ఆదిత్య నింబల్కర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఈ ఏడాది జులై 24న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అఫీషియల్ గా ప్రకటించింది. రాజ్ కుమార్ రావు వంటి పెర్ఫార్మెన్స్ ఓరియంటెడ్ హీరోతో కీర్తి జతకట్టడం ఈ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. 'బేబీ జాన్' ఫలితంతో సంబంధం లేకుండా, 'రాప్తార్' సినిమాతో కీర్తి సురేష్ బాలీవుడ్ లో తన సత్తా చాటుతుందని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.

# థాయ్‌లాండ్‌లో.. అందాల విందు

## రాయ్ లక్ష్మీరాయ్ రఫ్ఫా రఫ్ఫా



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తన గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాయ్ లక్ష్మీ ప్రస్తుతం సినిమాల కంటే తన అల్ట్రా లగ్జరీ లైఫ్ స్టైల్‌తోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ తాజాగా థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్నట్లు సమాచారం. అక్కడ పచ్చని ప్రకృతి ఒడిలో, ఎగ్జోటిక్ లొకేషన్లలో విహరిస్తూ ఫుల్ చిల్ అవుతోంది. ఈ విహారయాత్రకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులలో రాయ్ లక్ష్మీ ఒక ప్రత్యేకమైన వాహనాన్ని నడుపుతూ కనిపిస్తోంది. దీనిని ఆల్ టెర్రైన్ వెహికల్ లేదా ఏటీవీ అని పిలుస్తారు. పచ్చని అడవులు, ఇరుకు సందులు, కొండ ప్రాంతాల్లో ప్రయాణించడానికి ఈ వాహనం ఎంతో అనువైనది. నాట్ లాస్ట్, జస్ట్ ఎక్స్ ప్లోరింగ్.. బార్న్ ఫర్ ది వైలడ్ అంటూ క్యాప్షన్లు ఇస్తూ ఈ సాహసోపేతమైన రైడ్‌ను లక్ష్మీ రాయ్ తెగ ఎంజాయ్ చేస్తోంది. చిట్టి పొట్టి డెనిమ్ షార్ట్స్ , బ్లాక్ ఇన్నర్ ధరించి తన బోల్డ్ లుక్స్‌తో కుర్రకారు గుండెల్లో గుబులు రేపుతోంది. గత ఐదారేళ్లుగా రాయ్ లక్ష్మీకి చెప్పుకోదగ్గ సినిమాలు లేదా వెబ్ సిరీస్‌లు లేకపోయినా, తను లీడ్ చేస్తున్న లగ్జరీ జీవితం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఖరీదైన విదేశీ యాత్రలు, అల్ట్రా మోడ్రన్ దుస్తులు, విలాసవంతమైన జీవనశైలికి ఆమెకు అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోందని నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. కేవలం సినిమాలు మాత్రమే కాకుండా.. పలు బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు.. కమర్షియల్ ఈవెంట్స్.. సోషల్ మీడియా ప్రమోషన్ల ద్వారా బాగానే ఆర్జిస్తోందని అంచనా వేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197